# సమకాలీన రాజకీయ పరిస్థితులను ప్రతిభావంతంగా ప్రతిఫలించే చిత్రం

# చండమారుత

సాయుధ పోరాటం ద్వారా సమాజంలో విప్లవం – అహింసాయుతంగా ప్రజా ఉద్యమం ద్వారా సంపూర్ణ విప్లవం – ఇవి రెండూ ఇటీవల కాలంలో ఈదేశ సాంఘిక రాజకీయ వ్యవస్థను ప్రచండంగా ప్రభావితం చేశాయి. ఒకటి రహస్య పోరాటం, మరొకటి బహిరంగ పోరాటం సమకాలీన రాజకీయ చరిత్రలో ప్రధాన ఘట్టాలివి రెండూ. వీటిని ఇతివృత్తంగా శ్రీ తిక్కవరపు పట్టాభిరామరెడ్డి నిర్మించిన కన్నడ చిత్రం 'చండమారుత' – మొన్న 28 తేదీ ప్యావిల్లియను నెల్లూరులో ప్రదర్శించారు.

నడుస్తున్న చరిత్రను- రాజకీయ చరిత్రను- ప్రతిఫలించే చిత్రం 'చండమారుత'. సమకాలీన రాజకీయ ఇతివృత్తాలు గల్గిన చిత్రాలు మనకు చాలా అరుదు. సాధారణంగా మన సాంఘిక చిత్రాలు (తెలుగు దగుల్బాజీ చిత్రాలనుగూర్చి కాదు) సామాజిక ప్రతిబింబాలుగా ఉంటాయి; అస్పష్టంగానైనా సామాజిక చిద్రత కల్గిన చిత్రాలు వస్తుంటాయి. వాటిలో రాజకీయ పరిస్థితుల ప్రభావం పరోక్షంగా కనబడుతుందేగాని, ప్రత్యక్షంగా ఉండదు. ప్రత్యక్షంగా రాజకీయ సిద్ధాంతాలను, పరిస్థితులను దర్శించే చిత్రం 'చండమారుత'.

1975 నాటి పరిస్థితులకు సంబంధించిన చిత్రం ఇది. దేశాన్ని నైతిక, రాజకీయ సంక్షోభాలనుంచి కాపాడ్డానికి 'సంపూర్ణ విప్లవం' పేర జయప్రకాశ్ మేల్కొల్పిన ప్రజాచైతన్యాన్ని, ప్రభుత్వం జైళ్ళలో బంధించి, తాత్కాలికంగా అణగదొక్కింది. ఆ ఉద్యమంచేత ప్రభావితుడు కాలేక, కేవలం ఒక ప్రేక్షకుడుగా – ఆ ఉద్యమాన్ని ఫోటోలు తీసే ప్రేక్షకుడుగా- ఉండిన దినకర్ అనే విద్యార్థి సాయుధ పోరాటం వల్ల ఆకర్షితుడవుతాడు. ఈ వ్యవస్థను కూకటివేళ్ళతో పెళ్ళగించాలి అంటూ క్లాసురూంలో విప్లవ బోధించే ప్రొఫెసర్ భగవాన్ అనే ఒకనాటి '[illegible] ఉద్యమకారుని' వల్ల దినకర్ ఉత్తేజితుడై విప్లవ బృందంతో కలుస్తాడు. అతని స్నేహితురాలు విలాసిని

## సమీక్ష

కూడా ప్రోత్సహిస్తుంది. దినకర్ ఒక సమాజవైరిని చంపడానికి బదులు చిన్న దొంగవ్యాపారిని, అక్కణ్ణుంచి తప్పించుకోడానికి ఒక పోలీసు అధికారిని చంపుతాడు. పోలీసులు వెంటాడగా, భగవాన్ ఇంట్లో దాక్కుంటాడు.

ప్రొఫెసరు విప్లవ వాస్తవికతను, పరిణామాన్ని చూచి చలించిపోతాడు; స్త్రీమ ఆవేశంలో తాను చల్లిన విప్లవ బీజాలు ఎంత తీవ్రరూపంలో తన ఎదుట నిల్చినదీ తెలుసుకొని నిశ్చేష్టితుడౌతాడు. అయన భార్య సుధకు హృదయమైతేవుందికాని, దాన్ని అవసరం ఆమెకెప్పుడూ కల్గలేదు. దినకర్‌ను చూచి ఆమె జాలిపడుతుంది; తన భర్తలోలేని చిత్తశుద్ధి అతనిలో కనబడ్డంతో అతనికి సన్నిహితమవుతుంది. ఇంటిమీద కాపువుండిన పోలీసులు వారి ఏకాంతాన్ని భగ్నపరుస్తారు.

ఆరాత్రి ప్రొఫెసరు ఇంట్లో దొంగలు బడ్డారు. అప్పటికప్పుడే దినకర్ తప్ప మరెవరూ ఉండరు. దినకర్ ఆ దొంగను పట్టిస్తాడు. ఆకలి బాధకు ఓర్చలేక దొంగతనం చేస్తున్నాననే ఆ దొంగను వదిలి ప్రొఫెసరు ఆస్తి కాపాడ్డంలో తాను సమాజానికి చేస్తున్న అన్యాయం గుర్తిస్తాడు దినకర్. అప్పటికే పెనుగులాటలో గాయపడిన దినకర్, అప్పుడే ఇంట్లో ప్రవేశించిన ప్రొఫెసర్ని చంపి చనిపోతాడు. వెలుపల క్రైస్తవ ఉత్సవం ప్రశాంతంగా కదలిపోతు వుంది.

దర్శకుడు చేయదలచిన రాజకీయ వ్యాఖ్యానానికి ఈకథ ఒక ఉపకరణం మాత్రమే. దినకర్, ప్రొఫెసరు, అతని భార్య – వీరందరూ నేటి సమాజంలోని వివిధ వర్గాలకు ప్రతినిధులు. ప్రొఫెసరు హిపోక్రట్ అయిన బుద్ధిజీవి. అతని జీవన విధానానికి, వల్లించే సిద్ధాంతాలకు సంబంధంలేదు. తనకు భార్యనుకూడా సరిగా అర్థంచేసుకోలేని వ్యక్తి సమాజాన్ని సాయుధ పోరాటంతో మార్చాలంటూ ఉపన్యాసాలిచ్చి, ఆ ఉపన్యాసాల పర్యవసానాన్ని చూచి బెంబేలెత్తే మేధావి అతను. ఇటువంటి ఆత్మవంచకులవల్లనే సమాజానికి

—కొరవ 8 వ పేజీలో

# హైదరాబాదులో చిత్రపరిశ్రమకు శాశ్వత పథకాలు

గత మూడేళ్ళలో మొత్తం తెలుగు చలనచిత్ర పరిశ్రమను తెలుగుదేశానికి తరలింపచేసేందుకు ఒక పథకం అమలు జరపదలచామని ముఖ్యమంత్రి డాక్టరు చెన్నారెడ్డిగారు ఇటీవల హైదరాబాదులో జరిగిన ఒకానొక సభలో అన్నారు. తెలుగుదేశంలో నిర్మించబడే చిత్రాలకు ప్రభుత్వం యిస్తున్న సబ్సిడీ విషయమైకూడా పునరాలోచన ఉన్నట్లు ఆయనఅన్నారు. లోగడ ఈ పథకం ప్రారంభించినప్పుడు శాశ్వతంగా సబ్సిడీ ఇవ్వాలని అనుకోలేదని; అది మానేస్తే మరేవిధంగా పరిశ్రమకు సహాయం చేయగలమో ఆలోచిస్తామని ఆయనన్నారు.

ఐతే అటు తర్వాత ఒక వివరణలో సబ్సిడీ పథకాన్ని విరమించదలచలేదని ముఖ్యమంత్రి తెలియచేశారు. మద్రాసులోని సినిమా ముఖ్యులతో మాట్లాడి, రాష్ట్రంలో పరిశ్రమను అభివృద్ధి పరచడానికి శాశ్వతమైన ఏర్పాట్లు ఏవిచేస్తే బాగుంటుందో ఆలోచిస్తామని ఆయన అన్నారు. ఒక్కొక చిత్రానికి సబ్సిడీగా ఇచ్చే మొత్తంతో మరేదైనా శాశ్వత ప్రయోజనాన్ని సాధించే అవకాశం ఉందేమో పరిశీలించదలచామని అన్నారు.

సబ్సిడీపథకం ఒక విధంగా నిర్మాతలకు ప్రోత్సాహకరంగానేవుంది; కాని అదే శాశ్వతపథకంగా, దానిద్వారానే తెలుగుదేశంలో చిత్రపరిశ్రమ అభివృద్ధి చెందగలదని భావించడం పొరపాటు. దాన్ని తాత్కాలిక పథకంగా, నిర్మాతలను ప్రోత్సాహపరచేందుకు మాత్రమే ప్రవేశ

## సినిమా వార్తలు

పెట్టారు. అంతకన్నా ప్రయోజనకరమైన పథకాలను ప్రవేశపెట్టి, వాటిద్వారా పరిశ్రమను స్థిరపర్చడం అవసరం.

సబ్సిడీ ఇవ్వకూడదు అనే ఉద్దేశంగాదు. కాని దానివల్ల తెలుగుదేశంలో పరిశ్రమ పెద్దగా వ్రేళ్ళూనుకోవడం జరగదేమోనని పిస్తోంది. డబ్బు ఒక్కటే ప్రధానంగాక, అంతకుమించిన వసతులు సౌకర్యాలు ఆంధ్రదేశంలో కల్పించి, పరిశ్రమను స్థిరీకరించాల్సివుంది. చెన్నారెడ్డిగారు ఆ దూరదృష్టితోనే శాశ్వత పథకాలను తయారు చెయ్యాలనుకుంటున్నారు. వాటిలో ఒకటిగా సబ్సిడీ పథకంకూడా అవసరమైతే ఉండవచ్చు.

—కొరవ 8 వ పేజీలో

### అక్షర తూణీరం

సినిమాలో హీరోలా కవ్విస్తాడా?
నవలలోని ప్రియుడిలాగ నవ్విస్తాడా?
పాడుమొగుడు జీవితంలొ నాటుగుమాస్తే!
ఇన్నాళ్లూ యువతి కన్నకలలకు పస్తే!

—నాగభైరవ

(ప్రభుత్వ అనుమతి పొందిన)
నెల్లూరు సంగీత-నృత్య కళాశాల
ఉస్మాన్‌సాహెబ్‌పేట - నెల్లూరు-2.

1978-79 విద్యాసంవత్సరమునకు తే 7—6—1978 ది కళాశాల తెరువబడును.

సీట్లు పరిమితము. గాన తే 10-6-1978 ది లోపల శిక్షణ పొందదలచిన విద్యార్థులు దరఖాస్తులు పంపుకొనవలయును.

గాత్రము, వీణ, వైలెన్, భరతనాట్యములలో
గవర్నమెంటు సర్టిఫికేటు కోర్సుకు ప్రవీణులైన అధ్యాపకులచే శిక్షణ యివ్వబడును.

ప్రవేశ పరీక్ష : తే 11-6-78 ది ఉదయం 9 గంటలకు
ఇతర వివరములు కాలేజీనుండి పొందండి.

సి. సి. సుబ్బరాయుడు
సెక్రటరీ.

నూనె ఆదిశేషయ్య
ప్రసిడెంటు.

విద్యుత్ విప్లవం

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో పరవళ్ళు తొక్కుతూ ముందుకు సాగుతున్నది. ఈ పరిశ్రమలకు ప్రధాన కారణం మనరాష్ట్రంలో విద్యుచ్ఛక్తి ఉత్పత్తి గణనీయంగా పెరగడమే. విద్యుత్ ఉత్పాదన పెరుగుదల ఫలితంగా నేడు మనరాష్ట్రంలో అధునాతన ప్రగతిశీల ఆర్థిక సామాజిక వ్యవస్థ చక్కని రూపురేఖలు దిద్దుకొంటున్నది.

1078-79 వార్షిక ప్రణాళికలో విద్యుచ్ఛక్తి రంగానికి 18,000 లక్షల రూపాయలు కేటాయించారు. దిగువ సీలేరు మూడవ యూనిట్ 1977 నవంబరులో ఉత్పత్తి ప్రారంభించింది. కొత్తగూడెం నాలుగవ దశక్రింద 110 మెగావాట్ల శక్తిగల మొదటి యూనిట్ 1977 మార్చిలోనూ, రెండవ యూనిట్ 1978 జనవరిలోనూ పనిచేయడం మొదలుపెట్టాయి. 1978-79 సంవత్సరంలో విజయవాడ థర్మల్ స్టేషన్ మొదటి యూనిట్ పని ఆరంభం అవుతుందని ఆశిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉత్పత్తిలో నూతన శిఖరాలను చేరుకొంటున్నది.

డైరెక్టరు,
సమాచార, పౌరసంబంధశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాదు.

— 5/78-79.

